త్వరలో అద్భుత మహాఘట్టానికి శ్రీకారం

యాదగిరిగుట్ట ప్రధానాలయం

విమాన గోపురానికి స్వర్ణతాపడం పనుల ప్రారంభానికి ఏర్పాట్లు

గత ప్రభుత్వ హయాంలో 18.49 కోట్ల నగదు, 11 కిలోల బంగారం సేకరణ

మరింత సమకూరితే పనులు పూర్తి చేసే యోచనలో దేవస్థానం

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 23 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయం దివ్య విమానగోపురం స్వర్ణతాపడం పనులు త్వరలో ప్రారంభంకానున్నాయి. అందుకు అవసరమైన పనులను ప్రారంభించాలని దేవదాయ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. స్వామివారి గర్భాలయం విమానగోపురానికి స్వర్ణతాడపం అంటే స్వామివారికి బంగారు కిరీటం తొడిగే మహాఘట్టం అన్నట్లు. ఇది పూర్తి చేయాలన్న యోచనలో దేవస్థానం ఉన్నా ప్రభుత్వ పెద్దల నుంచి సరైన సమాధానం కోసం ఎదురుచూస్తున్నారు. స్వర్ణతాపడానికి కావాల్సిన బంగారం, నగదు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ దంపతులు, మంత్రులు, పెద్దలు విరాళంగా సమర్పించినా, నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఊసెత్తడం లేదు. విమాన గోపురం స్వర్ణమయం చేయడానికి 125 కేజీల బంగారం అవసరం ఉంటుందని వైటీడీఏ స్థపతులు అంచనా వేసినా, ఇప్పటి వరకు 11 కిలోల 109 గ్రాముల 900 మిల్లీ గ్రాముల బంగారం, 18 కోట్ల 49లక్షల 01వేల 470 నగదు సమకూరింది. ఇందులో కొంత భాగం వినియోగించగా మిగిలిన దావతో కలుపుకొని మరింత అవసరం ఉండగా, ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నది. తమిళనాడుకు చెందిన రవీంద్రన్ స్థపతి ఆధ్వర్యంలో విమానగోపురం స్వర్ణతాపడానికి కావాల్సిన రాగి తొడుగుల, అచ్చులు వేసే ప్రక్రియ పూర్తయ్యింది. బంగారంతో విమాన గోపురాన్ని తీర్చిదిద్దే పని మిగిలి ఉంది. కావాల్సినంత బంగారం సమకూరితే వెంటనే పనులు ప్రారంభించేందుకు స్థపతులు, దేవస్థానం అధికారులు సిద్ధంగా ఉన్నారు.

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయం విమాన గోపురం(ఫైల్)

గత ప్రభుత్వమే కూడబెట్టింది..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా స్వామి వారి ఆలయ దివ్య విమానగోపురం బంగామయం చేయాలన్న లక్ష్యంతో మాజీ సీఎం కేసీఆర్ 2022, ఫిబ్రవరి 11న కీలక ప్రకటన చేశారు. ఈ గొప్ప కార్యంలో ప్రజలను భాగస్వాములను చేయాలని సంకల్పించారు. తమకు తోచిన విధంగా విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. దాంతో అప్పటి బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, వ్యాపారులు స్పందించి తమకు తోచిన విధంగా విరాళాలు అందజేశారు. 2022లో సెప్టెంబర్ 30న నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ఒక కిలో 16 తులాల బంగారానికి సంబంధించిన రూ.52,48,097 విలువ గల చెక్కును అందజేశారు. సీఎం కేసీఆర్‌తో పాటు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి రూ.20లక్షలు, హైదరాబాద్‌కు చెందిన రజిత రూ.30 లక్షల 15వేలు, హైదరాబాద్‌కు చెందిన స్నేహిత బిల్డర్స్ రూ.51,00,624, హైదరాబాద్‌కు చెందిన ఏనుగు దయాకర్‌రెడ్డి రూ.50,04,000 చెక్కులను అందజేశారు. మాజీ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, నమస్తే తెలంగాణ సీఎండీ దీవకొండ దామోదర్‌రావు, హెటిరో గ్రూప్స్ కంపెనీ వారు రూ. 50 లక్షల చొప్పున చెక్కులు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రాష్ట్ర మాజీ గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ బంగారం నిలువుదోపిడీ ఇచ్చారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేతోపాటు చాలామంది బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు విరాళాలు అందజేశారు. చలాన్ల, ఆర్టీజీఎస్, నెఫ్ట్, క్యూఆర్ కోడ్, ఆన్‌లైన్ల ద్వారా తెలంగాణతోపాటు వివిధ రాష్ర్టాలకు చెందిన స్వామివారి భక్తులు విరాళాలు ఇచ్చారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకున్న విధంగా ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి విరాళాల సేకరణపై దృష్టి పెట్టలేదు. కనీసం ఆ పార్టీకి చెందిన బడా బడా నేతలు స్వామివారి దర్శించుకుని వెళ్తున్నారే తప్ప స్వామివారి బంగారు కిరీటమైన విమాన గోపురం స్వర్ణతాపడంపై ఊసెత్తడం లేదు. నూతనాలయం పునఃప్రారంభమైన దాదాపుగా మూడేండ్లు పూర్తి కావస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం త్వరగా స్పందించి స్వామివారి మహాకార్యం త్వరగా పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు

పరిహారం ఇవ్వకుండా

పట్టా భూముల స్వాధీనమా..?

పట్టాలు ఉన్నవారికి నష్టపరిహారం చెల్లించాలి

హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం తగదు

కూల్చివేత ఘటనల్లో బాధితులైన పేదలను ఆదుకోవాలి

చెరువుల విస్తీర్ణంపై స్పష్టత ఇవ్వాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్

కేపీహెచ్‌బీ కాలనీ, సెప్టెంబర్ 23: కూకట్‌పల్లి నల్ల చెరువులో పట్టా భూములకు నష్టపరిహారం చెల్లించకుండా.. ప్రైవేట్ వ్యక్తుల భూములను హైడ్రా కమిషనర్ ఏ విధంగా స్వాధీనం చేసుకున్నారో చెప్పాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రశ్నించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... కూకట్‌పల్లి నల్ల చెరువు పూర్తి విస్తీర్ణం 27 ఎకరాలు కాగా.. అందులో 7.30 ఎకరాలు మాత్రమే ప్రభుత్వ శిఖం భూమని, మిగిలిన భూమంతా ప్రైవేట్ వ్యక్తులకు పట్టాలు ఉన్నాయన్నారు. ఈ పట్టాదారులకు చెందిన భూములకు ఎలాంటి నష్ట పరిహారం, టీడీఆర్ లాంటివి ఇవ్వకుండానే ఎలా స్వాధీనం చేసుకుంటారన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లోని పట్టా భూముల్లో వెలిసిన నిర్మాణాలపై హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా కూల్చివేశారన్నారు. అసెంబ్లీ సమావేశం నిర్వహించి, ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి చెరువుల విస్తీర్ణంపై చర్చించాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని చెరువుల విస్తీర్ణంతో పాటు ఆ చెరువు పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు, పట్టా భూములను గుర్తించాలని, చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లపై స్పష్టతనివ్వాలన్నారు. ఆయా చెరువుల్లో ఎంత వరకు ఆక్రమణలు జరిగాయో తేల్చాలన్నారు. నగరంలో 600లకు పైగా చెరువులు ఉండగా.. నేడు 180 చెరువులు మాత్రమే కనిపిస్తున్నాయని, ఎవరి హయాంలో చెరువులు మాయమైపోయాయో సమాధానం చెప్పాలన్నారు. చెరువులపై స్పష్టత లేని కారణంగా, కూకట్‌పల్లి ఖాజకుంటలో ఇద్దరు జడ్జిలు స్థలాలను కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్నారని, ఇక సామాన్యులకు ఎలా తెలుస్తుందన్నారు. శని, ఆదివారం వచ్చేసరికి హైడ్రామా సృష్టిస్తున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. హైడ్రా పేరుతో నగరంలోని చెరువులు, కాలువల పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు భయంతో బతుకాల్సిన పరిస్థితులు తీసుకొచ్చారని మండిపడ్డారు.

ఎమ్మెల్యే కృష్ణారావు

హైకోర్టు ఆదేశాలతో..

కూకట్‌పల్లిలోని నల్ల చెరువును అభివృద్ధి చేయడానికి ప్రయత్నించిన ప్రతిసారి పట్టా భూములు కలిగిన వ్యక్తులు కోర్టులను ఆశ్రయించారని తెలిపారు. కోర్టు ఆదేశాలను పాటించడం వల్లే అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. చెరువు సందరీకరణలో భాగంగా 2017లో రూ.రెండు కోట్లు వెచ్చించి చెరువు కట్టను ఏర్పాటు చేస్తే.. హైకోర్టు ఆదేశాలతో ఆ కట్టను రెండు రోజుల్లోనే తొలగించాల్సి వచ్చిందన్నారు. చెరువులో మురుగు నీటిని శుద్ధి చేసేందుకు 50 కోట్లతో ఎస్‌టీపీ పనులను ప్రారంభిస్తే.. ఆ పనులు కూడా కోర్టు ఆదేశాలతో ముందుకు సాగలేదన్నారు. న్యాయస్థానం తీర్పును గౌరవిస్తూ.. చెరువును అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

గంట టైమిస్తే కొంపలు కూలుతాయా..?

చెరువు ఎఫ్‌టీఎల్ స్థలమని తెలియని పేదలు.. కష్టార్జితంతో రేకుల షెడ్లు నిర్మించుకున్నారని, ఆ షెడ్లులో పెట్టుకున్న విలువైన సామగ్రిని తీసుకోవడానికి ఓ గంట టైమిస్తే కొంపలేమైనా కూలుతాయా.. అని హైడ్రా అధికారులను ప్రశ్నించారు. మహబూబ్‌నగర్, సూర్యాపేట జిల్లాల నుంచి బతుకు దేరువు కోసం నగరానికి వచ్చారని, వారికి రాత్రి నోటీసులు ఇచ్చి తెల్లారేసరికి కూల్చడం సరికాదని, వారికి సమయం ఇవ్వాలన్నారు. కూల్చివేతలతో రోడ్డున పడ్డ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారాన్ని అందించాలన్నారు. మీకూ భార్యాపిల్లలు ఉన్నారు.. ఇలాంటి చర్యలు మంచివికాదు.. అని అధికారుల తీరును విమర్శించారు.

వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను బీమా కంపెనీలకు ఇవ్వొద్దు

ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్

చిక్కడపల్లి, సెప్టెంబర్ 23: భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు స్కీమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, ప్రభుత్వ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలను అందజేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. భారతీయ రాష్ట్ర కార్మిక సంఘం(బీఆర్‌టీయూ), తెలంగాణ బిల్డింగ్, అండర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ), స్ఫూర్తి భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎస్‌బీఎన్‌కేఎస్), తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ), తదితర సంఘాల ఆధ్వర్యంలో వందలాదిగా కార్మికులు తరలివచ్చి.. కార్మిక శాఖ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ.. నిర్మాణ కార్మికుల సంక్షేమానికి బోర్డు అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వకుండా.. ప్రభుత్వమే కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు నారాయణ, మారయ్య, సీఐటీయూ నాయకులు కాటం రాజు, వంగురు రాములు, ఎస్‌బీఎన్‌కేఎస్ గౌరవ అధ్యక్షుడు కుమార్, చంద్రమౌళి, ఐఎఫ్‌టీయూ నాయకులు అన్వేశ్, అనురాధ, భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు అరెల్లి కృష్ణ, విజయ్, పోలెరాజు, జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బెటర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై చర్చ

అధికారులతో నగర సీపీ సమావేశం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ట్రై పోలీస్ కమిషనరేట్లలో సరైన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ సేఫ్టీకి సంబంధించి సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లతోపాటు జీహెచ్‌ఎంసీ, హైడ్రా, హెచ్‌ఎండీఏ అధికారులతో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ ఆధ్వర్యంలో సోమవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ , భారీ వర్షాల సమస్యలు, బెటర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆయా విభాగాల అధికారులు చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకొని.. తీసుకోవాల్సిన అంశాల గూర్చి ఈ సందర్భంగా నగర సీపీ సీవీ ఆనంద్ వివరించారు. భారీ వర్షాలు వచ్చినప్పుడు ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, రోడ్లు, క్రిటికల్ జంక్షన్ల వద్ద ఏర్పడే సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేయడంలో అన్ని శాఖలు పనిచేయాలని తెలిపారు. ఇందులో సరైన ట్రాఫిక్ మళ్లింపులు, వాతావరణ విశ్లేషణలు, నోటిఫికేషన్లు, సైన్ బోర్డులు, ఇంజినీరింగ్ విభాగం నుంచి అవసరమైన మార్పులు, వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద వేగంగా నీరు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆయా విభాగాల అధికారులకు సూచించారు. దీర్ఘకాలిక ప్రణాళికలతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా అధికారులు నిర్ణయించారు. ఆయా విభాగాల అధికారులతో సంయుక్తంగా వర్క్‌షాప్ నిర్వహించడం, ట్రై పోలీస్ కమిషనరేట్ల ట్రాఫిక్ కమిషనర్లు, జీహెచ్‌ఎంసీ, ఇతర విభాగాల అధికారులతో హై లెవల్ కమిటీని ఏర్పాటు చేస్తూ.. ఐటీ కంపెనీలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నగర అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్ , జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్, నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్, రాచకొండ, సైబరాబాద్ సీపీలు సుధీర్‌బాబు అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు సరే.. పరిష్కారమేదీ?

సిటీబ్యూరో: దీర్ఘకాలిక, అపరిష్కృత సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావించి ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదుదారులకు జీహెచ్‌ఎంసీ నుంచి చుక్కెదురవుతోంది. స్వీకరించిన దరఖాస్తులకు పరిష్కారం చూపడం లేదని.. దీనికి కారణం వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ వస్తుండటం, అధికారుల మధ్య సమన్వయం లేక పరిష్కారం కావడం లేదని పలువురు మండిపడుతున్నారు. కోఠి కామత్ హోటల్ పక్కన జీహెచ్‌ఎంసీ షాపుల టెండర్ల అవకతవకలు జరిగాయని స్థానిక నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్, చందానగర్‌లో అనుమతి లేకుండా ఏడంతస్తుల భవన నిర్మాణం, అందులో నిబంధనలకు విరుద్ధంగా హాస్టల్ నడిపిస్తున్నారని గాయత్రి, నాలా ఆక్రమణలతో ఇబ్బందులు వస్తున్నాయని, శానిటేషన్, వీధి కుక్కల బెడదపై ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని అర్జీదారులు ఆరోపించారు. ఫలితంగా ప్రజావాణిపై నమ్మకం లేక ఫిర్యాదుదారులు రావడం లేదు. ఈ నేపథ్యంలోనే సోమవారం నిర్వహించిన ప్రజావాణికి అంతంత మాత్రమే స్పందన వచ్చింది. ప్రజావాణి ఫిర్యాదులపై కమిషనర్ సమీక్షించిన దాఖలాలు లేకపోవడం, ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడం గమనార్హం. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

పేరును కొనసాగించాలి

సిటీబ్యూరో/మేడ్చల్ కలెక్టరేట్: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బెలిదె రమేశ్ గుప్తా డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ పిలుపు మేరకు సోమవారం మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ గౌతమ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నగేశ్, శ్రీనివాస్, ప్రకాశ్, శేఖర్, నాగరాజు, చక్రపాణి, శ్రీధర్, కేదర్, సంతోష్, రమేశ్, చిరంజీవి, రవీందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా.. హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఆర్యవైశ్య మహాసభ నాయకులు కరపత్రాలు పంచుతూ నిరసన వ్యక్తం చేశారు. సురవరం ప్రతాప్‌రెడ్డి పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని, తెలంగాణకు సురవరం ప్రతాపరెడ్డి సేవలు చిరస్మరణీయమని, ఏదైనా ప్రాజెక్టు నిర్మించి సురవరం పేరు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మణ్ గుప్తా, శివకుమార్, లింగ ప్రకాశ్, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్ పేరుతో రూ.28.5 లక్షలు టోకరా

సిటీబ్యూరో, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన స్టాక్స్ ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్‌ను చూసి ఆకర్షితుడైన ఒక వ్యాపారి సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి రూ. 28 లక్షలు మోసపోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన ఓ వ్యాపారి ఫోన్ నంబర్‌ను వాట్సాప్‌లో వీఐపీ 101 ఏబీఎంల్ స్టాక్ స్ట్రాటజీ గ్రూప్‌లో యాడ్ చేశారు. ఆ గ్రూప్‌లో 49 మంది సభ్యులున్నారు. తమ వద్ద స్టాక్స్‌లో పెట్టుబడి పెడితే ఎలాంటి రిస్క్ లేదని, ఎక్కువ లాభాలొస్తాయంటూ నమ్మించారు. అందులో ఉన్న వారు కూడా మాకు లాభాలొచ్చాయంటూ చెప్పారు. దీనికి ఆకర్షితుడైన బాధితుడు తాను కూడా పెట్టుబడి పెడుతానంటూ ముందుకొచ్చాడు. దీంతో బ్యాంకు అకౌంట్ నంబర్‌ను తమ ఆధీనంలోకి తీసుకొని యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అందులో మేం చెప్పినట్లు పెట్టుబడి పెట్టాలని, బ్యాంకు ఖాతా వివరాలు మా దగ్గర ఉంటే ఎప్పటికప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి అమ్మడం, కొనడం చేస్తామంటూ నమ్మించారు. ఈ క్రమంలోనే మొదట కొన్ని లాభాలు చూపించిన సైబర్‌నేరగాళ్లు.. ఆ తరువాత భారీ మొత్తంలో దఫ దఫాలుగా రూ. 28,50,894 పెట్టుబడి పెట్టించి మోసం చేశారు. ఇంకా పెట్టుబడి పెట్టాలంటూ ఒత్తిడి చేయడంతో వాస్తవాన్ని గుర్తించిన బాధితుడు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్నో స్మార్ట్ సిటీలో హైదరాబాద్ మేయర్ బృందం

సిటీబ్యూరో: లక్నో స్మార్ట్ సిటీలో బెస్ట్ ప్రాక్టీసెస్ అధ్యయన పర్యటనలో భాగంగా జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి 40 మంది కార్పొరేటర్లతో కలిసి సోమవారం లాల్‌బాగ్‌లోని లక్నో స్మార్ట్ సిటీ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ మూడు కమాండ్ సెంటర్లలో నిర్వహిస్తున్న కార్యకలాపాలను మేయర్ బృందం పరిశీలించింది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కమాండ్ సెంటర్‌ను సందర్శించి, బ్యాటరీతో నడిచే ఆటోల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతున్నట్లు, ప్రతి కాలనీలో షెడ్యూల్ సమయం మేరకు నిర్దేశించిన రూట్లలో ఆటోలు వెళ్లేలా.. ఆటోల కదలికలను సిస్టం కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్నట్లు పరిశీలించారు. సేఫ్ సిటీ కమాండ్ సెంటర్ ద్వారా మహిళలు, పిల్లల రక్షణ, ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కమాండ్ సెంటర్‌ను సందర్శించారు.

నకిలీ మద్యం పట్టివేత

బేగంపేట, సెప్టెంబర్ 23: బేగంపేట ఎక్సైజ్ పోలీసులు భారీగా నకిలీ మద్యం పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్దనుంచి సుమారు రూ. 4.15 లక్షల విలువజేసే మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బేగంపేటలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన ప్రమోద్ మల్లిక్(37), జగన్నాథ సాహూ(35), ఆకుల అజయ్‌కుమార్, కలకంద అనిల్‌కుమార్(32) కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. విలువైన మద్యం ఖాళీ బాటిళ్లను సేకరించి.. ఆ బాటిళ్లలో నాసిరకం తక్కువ ధర మద్యం నింపుతున్నారు. ఈ బాటిళ్లను హర్యానా, ఢిల్లీ నుంచి తెప్పించామని నమ్మిస్తూ.. అవసరమైన వ్యక్తులకు విక్రయిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు ఆదివారం రాత్రి నిఘా పెట్టారు. సికింద్రాబాద్ మినిస్టర్స్ రోడ్డు మీదుగా ఆటోలో తరలిస్తున్న నకిలీ మద్యం సీసాలను పట్టుకున్నారు. ఆటోలో ఉన్న అజయ్‌కుమార్‌ను విచారించగా.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్12 లో ఉన్న షభానా రెసిడెన్సీ నుంచి ఈ మద్యం సీసాలను తీసుకొచ్చినట్టు చెప్పాడు. దీంతో ఆ రెసిడెన్సీపై కూడా దాడి చేశారు. మొత్తం రూ. 4.15 లక్షల విలువజేసే అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు ఐడీ కార్డులు

సూర్యాపేట, సెప్టెంబర్ 23 : జిల్లాలో ముగ్గురు ట్రాన్స్‌జెండర్స్‌కు ఐడీ కార్డులు, ట్రాన్స్ జెండర్ సర్టిఫికెట్స్‌ను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అందించారు. ట్రాన్స్ జెండర్స్ త్రినేత్రి, షేక్ చాందినీ, సుజాత సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ చేతుల మీదుగా వాటిని ట్రాన్స్‌జెండర్స్ అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, సంజీవ, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

నిరసన తెలుపుతున్న సీతారాంపురం గ్రామస్తులు

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 23 : గ్రామంలోని సర్వే నెంబర్ 179లోని 63ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుండాల మండలం సీతారాంపురం గ్రామస్తులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేయడం తోపాటు హరితహారంలో నాటిన చెట్లను సైతం తొలగించారన్నారు. రాజకీయ నాయకుల అండ చూసుకుని ప్రభుత్వ భూమిని పట్టా చేయించుకోవాలని ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కబ్జాకోరల్లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

సేంద్రియ సాగుతో అధిక లాభాలు

పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ శాంతినిర్మల

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 23 : సేంద్రియ సాగుతో అధిక లాభాలు గడించవచ్చని ఏడీఏ శాంతినిర్మల అన్నారు. గుండ్లపల్లి గ్రామంలో సోమవారం పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంతో భూసారం దెబ్బతినడంతోపాటు రైతులకు పెట్టుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు అప్రమత్తమై సేంద్రియ పద్ధతిలోనే వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సుధారాణి, ఏఈఓలు వీరన్‌కుమార్, ప్రణయ్‌రెడ్డి పాల్గొన్నారు.

'తిరుపతి లడ్డూ తయారీలో తప్పిదాలకు పాల్పడిన వారిని శిక్షించాలి'

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 23 : తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీలో ఘోర తప్పిదానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్యవైశ్య సంఘం సభ్యులు అన్నారు. లడ్డూ తయారీలో కల్తీ నూనె వాడిన వారిని శిక్షించాలని కోరుతూ పట్టణంలోని గోవిందా క్షేత్ర దేవాలయంలో సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ తప్పిదానికి కారకులు అయిన గత పాలకమండలిని, గత ప్రభుత్వాన్ని శిక్షించాలని కోరారు. ఇలాంటి పొరపాట్లు జరుగకుండా ఉండాలంటే టీటీడీ బోర్డు తరపున గోశాలను ఏర్పాటు చేసి దేశీ గోవులను పెంచి పోషిస్తే బాగుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం భువనగిరి అధ్యక్షుడు, ఆలయ కమిటీ సభ్యుడు పసుపునూరి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు నాగేందర్, జనార్దన్, రామకృష్ణ, సతీశ్, రాజేశ్, రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అంకం పాండుకు ఘన సన్మానం

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 23 : చేనేత కార్మిక సంఘం నూతన అధ్యక్షుడు అంకం పాండును పట్టణంలోని ప్రగతి యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ప్రగతి యువజన సంఘ అధ్యక్షుడు ఎలగందుల నర్సింహా, గౌరవ సలహాదారులు సోమవరపు లక్ష్మీనారాయణ, బోగ విజయ్, ఉపాధ్యక్షుడు కూరపాటి నరేందర్, కార్యదర్శి కడవేరు రామేశ్వర్, కోశాధికారి వేముల శ్రీశైలం, ప్రతినిధులు భాను, రామకృష్ణ, మహేశ్, స్వామి, భాస్కర్, కృష్ణ పాల్గొన్నారు.

సంతోష్‌గౌడ్‌కు ఆదర్శ కళానిలయం రాష్ట్ర స్థాయి అవార్డు

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 23 : మండలంలోని కొలనుపాక గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త భీమగోని సంతోష్‌గౌడ్ ఆదర్శ కళానిలయం రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. ఆదర్శ కళానిలయం 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని దేవులపల్లి రామానుజన్‌రావు కళామందిరంలో ఆదివారం ఐపీఎస్ అధికారి వెంకటరామ్‌రెడ్డి, జబర్దస్త్ టీమ్ చేతుల మీదుగా ఈ అవార్డు పొందారు. తాను చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయి అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందని సంతోష్‌గౌడ్ అన్నారు.

ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు.. విస్మరించారు..

శ్రీశైలం ముంపు బాధితుల ఆవేదన

ఖైరతాబాద్, సెప్టెంబర్ 23: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా ముంపు గ్రామాల్లోని నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని, ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని శ్రీశైలం ప్రాజెక్టు నీటి ముంపు నిర్వాసితులు విమర్శించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్వాసితులు జె. కొండన్న, గోవింద్, కె.దాగోజి రావు మాట్లాడుతూ.. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అప్పటి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 67 గ్రామాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. కూడావెల్లి, ఉప్పలపాడు, సోలిపూర్ గ్రామాలు కనుమరుగయ్యాయని అన్నారు. 1986లో అప్పటి టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు ఎన్నికల ప్రచారంలో భాగంగా భూనిర్వాసితులను కలిసి న్యాయం చేస్తామని చెప్పారని, కానీ ఎలాంటి న్యాయం జరుగలేదన్నారు. తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

సీవరేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

క్షేత్రస్థాయి పర్యటనలో జలమండలి ఎండీ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో దీర్ఘకాలికంగా.. తరచూ సీవరేజీ సమస్యలు తలెత్తే ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇకనుంచి సమస్యలు తలెత్తే ప్రాంతాలను స్వయంగా వారంలో ఒకటి, రెండు రోజులు సందర్శిస్తానని వెల్లడించారు. బేగంపేటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లానర్స్ ఇండియా (ఐటీపీఐ) ప్రాంతీయ కార్యాలయం సెల్లార్‌లో నీరు నిలిచి, పార్కింగ్‌కు అసౌకర్యంగా ఉన్నందున ఐటీపీఐ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు ఎండీ అశోక్‌రెడ్డి ఆ కార్యాలయాన్ని సందర్శించారు. సెల్లార్‌లోకి వెళ్లి పరిశీలించారు. ఆ నీరు ఎలా వచ్చిందో గుర్తించి, దానికి అనుగుణంగా సమస్యను పరిష్కరించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక జీఎం వినోద్‌కుమార్‌ను ఆదేశించారు. ఆ తర్వాత బ్రాహ్మణ వాడీ లేన్–1లో చాలా కాలంగా సీవరేజీ సమస్య ఉన్నదంటూ పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో ఆ ప్రాంతాన్ని సైతం ఎండీ సందర్శించారు. సమస్యను పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

బ్రాహ్మణ పరిషత్ నిధులు విడుదల చేయండి

మంత్రిని కలిసిన బ్రాహ్మణ పరిషత్ సభ్యులు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): బ్రాహ్మణ పరిషత్ నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తూ తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య సభ్యులు సోమవారం మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. పరిషత్ ద్వారా విదేశీ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ శర్మ, మోత్కూరు రామేశ్వర్ రావు, సమిలికొండ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి భారీగా దరఖాస్తులు

సూర్యాపేట, సెప్టెంబర్ 23 : సమస్యల పరిష్కరించాలని జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్దఎత్తున కలెక్టరేట్‌కు వచ్చారు. సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజలతో సమావేశ మందిరం కిటకిటలాడింది. గత రెండు సోమవారాలు ప్రజావాణి లేక పోవడంతో ప్రజలు ఒక్కసారిగా తమ సమస్యలను కలెక్టర్‌కు తెలుపుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. దీంతో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజావాణిలో కలెక్టర్ దరఖాస్తులు తీసుకున్నారు. ఈ ఒక్కరోజే 149 దరఖాస్తులు వచ్చాయి. భూ సమస్యల పరిష్కారం కోసం 45, వివిధ మండలాల తాసీల్దార్లకు 16, ఆర్డీఓలకు 7, మున్సిపల్ కమిషనర్లకు 7, వ్యవసాయ అధికారులకు 11, జిల్లా పంచాయతీ అధికారికి 12, పీడీ మెప్మాకు 8, ఇతర శాఖలకు 43 దరఖాస్తులు వచ్చాయి. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఒక్కొక్క దరఖాస్తుకు పది నుంచి 15 మంది వరకు రావడంతో కలెక్టరేట్ ప్రజలతో కిటకిటలాడింది.

శంభులింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

మేళ్లచెర్వు, సెప్టెంబర్ 23 : స్థానిక స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వయంభువుడికి పంచామృతాభిషేకాలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజల అనంతరం స్వామివారిని అర్చకులు కొంకపాక శివ విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ పూలతో విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా కోదాడ మండలం ఆకుపాముల గ్రామానికి చెందిన దాత చల్లా శివకుమార్ ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ శంభిరెడ్డి, ఈటకొండారెడ్డి పాల్గొన్నారు.

బడ్డీ కొట్లు తొలగించొద్దని ఎమ్మెల్యేకు వినతి

కోదాడ టౌన్, సెప్టెంబర్ 23 : బడ్డీ కొట్లను తొలగించి తమను రోడ్డు మీద పడేయొద్దని కోదాడ పట్టణంలో కోర్టు ఎదురుగా ఉన్న పలువురు చిరు వ్యాపారులు ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. 20 సంవత్సరాలుగా బడ్డీ కొట్లు పెట్టుకొని ఉపాధి పొందుతున్నామని, ఇటీవల కోర్టు వారు కొట్లను తొలగించాలని నోటీసులు ఇచ్చారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై 30 కుటుంబాలు బతుకుతున్నాయని, మానవతా దృక్పథంతో తొలగించకుండా చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు తొలగించబోమని, అతి త్వరలో పురపాలక సంఘం తరపున దుకాణాలు నిర్మించి, ఉపాధి చూపిస్తామని చిరు వ్యాపారులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిరువ్యాపారుల సంఘం గౌరవ సలహాదారులు బషీర్‌బాయ్, అధ్యక్షులు రసూల్, బాజాన్, బాగ్దాద్, అబ్బు, మదర్సా, వెంకన్న, పాషా, విజయ్, నాగేశ్వర్‌రావు, రాము, జ్యోతి, సుజాత, ఫాతిమా పాల్గొన్నారు.